**హృదయం లేని ఊరు పెద్దగా కట్టుబాటును నిలపాలా? మనిషిగా రెండు ప్రేమ హృదయాలను కలపాలా?**



# తుపాను తీరం దాటింది

జీవ్వుమంటూ ఉద్రిక్తంగా తుపాను గాలి ఊరిని మరోసారి పులిస్తరాకులా చుట్టుకుపోయేలా విజృంభిస్తోంది. తేమగాలితో వాతావరణం మారుతోంది.... క్షణ క్షణానికీ గాలి వేగం పెరిగిపోతోంది.

శాఖోప శాఖలుగా విస్తరించుకుని నిలువెత్తున ఉంది రావి. ఆ రావికింద గ్రామ చావడిలో కొలువుదీరి ఉన్నాడు చినసింగరాయరెడ్డి. అంతటి గాలిలోనూ లేచే ప్రయత్నమేమీ చేయకుండా అందరు చెప్పేదీ అప్పటిదాకా విన్నాడు. ఆలోచనలో పడ్డాడు, మీసం మెలివేస్తూ.

రావి అన్నేళ్ళ స్థానబలాన్ని కాదని కుదమట్టంనించి కుదిపేస్తోంది తుపానుగాలి

ఆ గాలిజడికి చాలామంది సర్దుకునేవారే. కాని కదలని పెదరెడ్డిని చూసి ఎవరూ కిక్కురు మనడంలేదు. తుపాను గాలి చల్లగా....చలిగా ...యింకింత చెమ్మగా శరీరాలను తాకుతోంది.

ఎగిరిపోతున్న గుడ్డలను కప్పిపట్టుకుంటూ అంతా ఎదురు చూస్తున్నారు

చిన సింగరాయరెడ్డి తలెత్తి ఆకాశం వంక చూశాడో క్షణం.

ఊరిమీదకు విరుచుకుపడే మదించిన ఏనుగుల గుంపులా కారునల్లని మేఘాలు ఆకాశంలో కగం తొక్కుతూ పరుగులు తీస్తున్నాయి. చూశాడు చినసింగ రాయరెడ్డి. దృష్టి జనంవైపు మరల్చుతూ ఏదో నిశ్చయాని కొచ్చినట్టు తల పంకించాడు.

ఎదురుగా చెల్లాచెదురుగా కూర్చున్న పల్లెకారులంతా ఊపిళ్ళు బిగించారు. పెదరెడ్డి ఏం చెబుతాడోనన్న ఉద్విగ్నతతో.

గ్రామచావడే ఆపల్లెన్యాయస్థానం. ఎటువంటి చిన్నతగవునించి ఎంత పెద్దగొడవ జరిగినా న్యాయం చెప్పబడేది అక్కడే. ఇది ఈనాటిది కాదు మూడు తరాలనించీ అదే రావి క్రింద అదే వంశం మనిషి ఊరిపెద్దగా, పెదరెడ్డిగా యిస్తున్న తీర్పు ఆ పల్లెకారులకు దేవుని శాసనం, శిరోధార్యం

ఆ వంశం చినసింగరాయరెడ్డిది. చినసింగరాయరెడి తండ్రి రంగరాయరెడ్డి ఆయనతండ్రి పెదసింగరాయరెడ్డి తరాలు మారి మనుషులు మారారు. పెదరెడ్డి పోతే చినరెడ్డి అయాడే తప్ప వారు చెప్పిన న్యాయం ఎన్నడూ మారలేదు. అందుకు సాక్ష్యం గ్రామ చావడీ....నిలువెత్తు రావీ. ధర్మశాస్త్రం అలిఖితమే అయినా ఓ నేరానికి ఊరికి వారిచ్చిన తీర్పూ, శిక్ష యెప్పుడూ ఒక్కటే

ఆ పల్లెకంటూ కొన్ని కట్టుబాట్లు నెలకొల్పారు వారు. వాటిగటు తాము దాటరు. ఎవరైనా దాటడమనేది వూహామాత్రంగానైనా సహించలేరు

పంజా చరిచేముందు నిశితంగా చూసే పులిలా అందరి కళ్ళలోకీ తీక్షణంగా ఆగి ఆగి చూస్తూ మైనామీద చూపు నిలిపాడు చినసింగరాయరెడ్డి

గుంపుకు దూరంగా ఓ మూల పైట చెంగు తలాగా తిప్పి బేలగా ముడుచుకుని కూర్చుని ఉంది మైనా. నిశ్శబ్దంగా పంట కాలువలు ప్రవహిస్తున్నాయి ఆమె కళ్ళనుంచి.

ఆమె ఒళ్ళంతా ఎర్రటి వాతలు.... రక్తం కమిలి గడ్డకట్టిన తాటల చారలు.... పశుప్రవృత్తితో కమ్చీతోనో, పట్టాతోనో హింసించిన గుర్తులు....

కంట ఉబకబోయిననీటిని మొదలంటా అదిమిపెట్టాడు చినసింగరాయరెడ్డి. మసక బారుతున్న కళ్ళను వెంటనే తిమ్మన్న మీదికి మళ్ళించాడు ముఖం తీక్షణమైంది.

తిమ్మన్న మైనా మగడు. కర్రబోటుగా వేసుకుని అల్లంత దూరాన నిలిచిఉన్నాడు. పిచ్చుక గూడులాటి గిరజాల జుట్టు. కండలు మెలిదిరిగిన శరీరం. కళ్ళనిండా క్రౌర్యం. తిమ్మన్నను చూస్తే ఒళ్ళు జలదరిస్తుంది.

పెదరెడ్డి తనవైపు చూడడంతో "దొర! ఏవైన సరె...." అంటూ ఉద్రేకంగా ఏదో వాగబోయాడు తిమ్మన్న.

చినసింగరాయరెడ్డి కళ్ళలో విస్ఫులింగాలు రేగాయి. వెంటనే దవడలు బిగించి ఉరిమి చూశాడు వాణ్ని. తిమ్మ

న్నకు గుటక ఆగిపోయింది వెంటనే. మాట పెగల్లేదు. కాళ్ళలో చలి నిలువంటా తన్నింది కచ్చాలో ఉచ్చ పోసుకున్నంత పని చేశాడు భయంతో.

అప్పటికీ తల తిప్పలేదు చినసింగ రాయరెడ్డి....

జ్వుయ్... అంటూ ఓ వూపు లేపింది తుపాను గాలి. సింగరాయరెడ్డి భుజంమీది పైకండువా ఎగిరి అల్లంత దూరాన పడిందా గాలికి. ఓ పాలెె కాపు తెచ్చి అందించబోయాడు పెదరెడ్డికి.

ఆయన దాన్నందుకునే ప్రయత్నం ఏమాత్రం చేయకుండా చిన్నప్ప మీదకు దృష్టి మళ్ళించాడు. చిన్నప్ప.... మెడకు సాయిబు తురాయి. కావిరంగు బనీ్న లోంచి బలంగా కనిపిస్తున్న దేహం.... సాధారణ ముఖ కవళికలు. అతని మొలన అల్లన అగుపిస్తోందో పిల్లనగ్రోవి

పల్లెప్రజలంతా పెదరెడ్డిని వింతగా చూడడం మొదలుపెట్టారు. "ఏమిటి కీనాడు పెద్దరెడ్డి యిట్ల చేస్తండు? ప్రతి పాలీ శదీల్మని ఏదోనొకటి చెప్పేవాడు గద!" అని అందరూ మనసుల్లో గొణుక్కో సాగారు. క్షణక్షణానికి పెరుగుతున్న తుఫానుగాలి తాకిడికి అందరికీ యిండ్లకు పోయికూర్చోవాలని ఉంది.

కాని ఆలోచనలు ఓ కొలిక్కి రానట్టు మీసం మెలివేస్తూ కాలి బొటన వేలి పై చూపు నిలిపాడు చినసింగరాయరెడ్డి. పల్లె ప్రజ అంతా ఆయన నోటి మాటకోసం యెదురు చూస్తోంది.



అంతా సూదిమోత నిశ్శబ్దం—తుపాను గాలి తప్ప.

చినసింగరాయరెడ్డి ఆలోచిస్తూనే వున్నాడు.

పల్లెప్రజ యెదురు చూస్తూనే వుంది.

తిమ్మన్న భయంతో నలుగుతూనే వున్నాడు.

మైనా అలా ముడుచుక కూర్చునేవుంది

చిన్నప్ప తల దించుకునే ఉన్నాడు....

—జివ్వ్వన రేగింది తుపాను గాలి.

తటాలున లేచాడు చినసింగరాయరెడ్డి. కాళ్ళు కిర్రు చెప్పులలో దూర్చి ఎడమ చేత కండువా అందుకుని భుజంమీద వేసుకున్నాడు.

"ఏమిటి చేయాలన్నది రేపటికి చెబతా. అందరూ యిండ్లకు బొండి యిప్పటికి." కంచులా చెప్పాడు. పల్లెప్రజ దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచి లేచింది. ఉద్విగ్నత చల్లబడి జారుకుంటుండగా మళ్ళీ అన్నాడు మైనాని చూస్తూ:

"ఆయమ్మి ఆడికాడికి బోమ. ఈయాల్టికి మన పిల్లకాయల బడిలో ఉంటది- నే జెప్పేవరకూ"

ఒక్క క్షణం ఆగాడు. పక్కనేఉన్న పెద్దపంతులు వంక చూశాడు. అది ఆజ్ఞ. శిరసు వంచాడు పెద్ద పంతులు నమస్కరిస్తూ.

స్థిరంగా అడుగులు వేసుకుంటూ ఊరి వైపు నడిచాడు చినసింగరాయరెడ్డి.

* * *

రెండేళ్ళక్రితం మైనాని మనువాడాడు తిమ్మన్న. అప్పటికి మైనా పెద్ద మనిషై రెణ్నెల్లయింది.... కనాకష్టం మీద పధ్నాలుగేళ్ళు నిండి ఉంటాయి. పెద్దలు చేసిన పెళ్ళి నచ్చటం, నచ్చకపోవటం అనేది లేదు- అది తెలిసే వయసూ కాదు.

అలా ఏమీ తెలియని ఆ పిల్ల తిప్పలు తొలిరాత్రినుంచే ప్రారంభమయాయి.

గదిలోకి నెట్టబడింది మైనా. మరుక్షణం పశువులా మీద పడ్డాడు తిమ్మన్న. ఆమె బాధతో అరిచే అరుపులూ, కేకలూ లక్ష్య పెట్టకుండా ఓ అయిదు నిముషాలు స్వైర విహారం చేసి తన ఆకలిని తీర్చుకున్నాడు.

మైనాకు శరీరం మాంసపు ముద్దలా అనిపించింది కూడదీసుకుంటుంటే. ఆమె అలా వుండగానే అదేరాత్రి మరో రెండు సార్లు మైనాని వెంటుగా చీల్చాడుతిమ్మన్న.

అప్పుడే పుట్టింది మైనాకు తిమ్మన్న అంటే భయం.

భయం పుట్టాలేగాని అది బహుముఖమై పెరగడానికి యెంతసేపు!

అంతే! అక్కడినుంచి రాత్రి కావస్తోందంటే బెదిరిపోయేది. తిమ్మన్న కనిపించాడంటే భయంతో మెలితిరిగి

పోయేది. అతను దగ్గరకు వస్తున్నాడంటే వణికిపోయేది. ముడుచుకుంటూ దూరం దూరం తొలగేది. ఆమె దూరం తొలగిన కొద్దీ వికృతంగా ప్రవర్తించేవాడు తిమ్మన్న. గుంజేవాడు. చెయ్యి మెలిదిప్పేవాడు. బుగ్గలు పిండేసేవాడు. జుట్టు కుదిమేసేవాడు.

వేడి పుట్టని ఆమె శరీరాన్ని మైనపు ముద్దలా నలిపేసి తన వేడిని చల్లార్చుకునేవాడు. తను స్వర్గ ద్వారాలు తెరుచుకుంటూ ఆ పిల్లకు నరకాన్ని చూపేవాడు.

కాలం గడుస్తున్న కొద్దీ మైనాకు ఈ తతంగం మరింత భయంకరమైపోయింది. ఆమెకు భయం పుట్టడానికి తొలిరాత్రి పడింది పునాది. మలిరాత్రి నుంచీ ప్రతిరాత్రీ ఓ రాయి పడి అదో భవనంగా మారింది.

రాత్రులు రాత్రులు నిద్రలేకుండా గడిపేది మైనా.

“ఏం పిల్లా! కొత్త కాపరం ఉసారు ఇంకా తగ్గలేదేటి?” మైనా ఎర్రటి కళ్ళనుచూసి మరేదో ఊహించుకుంటూ అడిగేవాడు చిన్నప్ప.

చిన్నప్ప చినసింగరాయరెడ్డి యింట పాలికాపు. ఒంటరిగాడు చకచకా పశులపని కానిచ్చెయ్యడం. కసింత ముద్ద మూట గట్టుకుని తోటకుపోయి అక్కడే కాపు గాయడం.... ఎప్పుడో జాతరలో కొన్న ‘పిల్లంగోరు’పై పదాలు పాడుకోవడం... యిదీ అతని పని

మైనా ఏదో ఏట పెదరెడ్డిగారింట అడుగుపెట్టింది. ఆనాటినుంచీ వయసుతో బాటు యింటిపనులనూ కూడుకుంటూ ఈనాటికి వాకిలంతా చిమ్మి కళ్ళాపి జల్లి ముగ్గులు పెట్టడం. కొట్టం శుభ్రం చెయడం చెరువుకుపోయి నీళ్ళు తేవడం, ఆపైన చల్ల చిలకడం చేస్తుంది.

ఉదయాన్నే లేచి ‘వందుంపుల్ల’ నోట బెట్టేసరికి మైనా ప్రత్యక్షమవుతుంది అక్కడ చిన్నప్పకు రోజూ. ఏదో ఒక చతురాకి మైనా సిగ్గుతో తలవంచుకోవడం చూసి నవ్వుకుంటూ అక్కడినించి పోతాడు.

చినసింగరాయరెడ్డి అప్పుడప్పుడూ యిది గమనించి తనూ నవ్వుకుంటాడు ముసిముసిగా గుబురుమీసాల చాటున కనిపించీ కనిపించకుండా.

ఆ రోజు బాగా పొద్దెక్కిపోయిందని కంగారుపడుతూ నీళ్ళు తేవడానికి గబగబా చెరువుకి వెళ్ళింది మైనా. బిందెతోమి రేవులో దిగి కడుగుతోంది. రేవులో మరెవ్వరూలేరు.

అంతలో మధురమైన వేణుగానం వినిపించసాగింది యెక్కడినుంచో.

మైనా బాధాతప్త హృదయానికి ఆ నాదం పన్నీటిజల్లులా సోకింది. గాలి అలల్లో మెల్లమెల్లగా తేలివస్తున్న ఆ మాధురిని వింటూనే మైనా శరీరం పులకించింది.

నీటిని తెర్లించి ముంచడానికి సిద్ధంగా వున్న బిందెని అలానే వదలి ఆత్రతగా నుంచుని చుట్టూ చూడసాగింది.

దూరంగా కనబడ్డాడు చిన్నప్ప.... చెరువు ఆవలి వొడ్డున ఓ చెట్టు మొదల్లో కాలుమీద కాలువేసుకుని కూర్చున్నాడు. మోవిపైన పిల్లనగ్రోవిని నలికిస్తూ లోకాన్ని మరచి తన్మయత్వంలో మునిగిపోయి ఉన్నాడు. అతను కూర్చున్న తీరే తప్ప కదలికలేపీ కన్పించడం లేదు.



ఎ.వి.మంగపతిరావు

పి.వి.సుబ్బారావు

పెదరెడ్డిగారి గేదెలు చెరువులో ఓ మూల ఈదులాడుతున్నాయి.

మైనా చేష్టలుడిగి నిలుచుండిపోయింది. ఆ పిల్లనగ్రోవి నుంచి వస్తున్న స్వరాలు వింటున్నకొద్దీ వినాలనిపిస్తోంది. తీయని అనుభూతి ప్రాణం పోసుకోగా తనువు మరచి ఆ మురళీరవాన్ని వినసాగింది. అనిమిషంగా దూరాన ఉన్న చెట్టునూ, దాని కిందే ఉన్న చిన్నప్పనూ చూస్తూండిపోయింది మైనా.

ప్రమోయించి ప్రమోయించి ఎప్పటికో ఆపాడు చిన్నప్ప.

కలనుంచి వాస్తవానికి జారినట్టు తత్తరపడింది మైనా. ఉలికిపాటుతో చుట్టూ పరికించింది....

చెరువులో ఉంది తను!

అంతలోనే గుర్తొచ్చింది- పెద్దరెడ్డికి నీళ్ళకోసం తనొచ్చిందని. నిస్త్రాణిగా వంగుంది నీరు ముంచుదామని. బిందె.... ఏదీ బిందె? ఉలిక్కిపడింది. కంగారుగా చుట్టూ చూసింది.

చెరువుమధ్య కన్పించింది నీటిపై వయ్యారంగా తేలుతూ- బిందె.

బిత్తరపోయింది మైనా. జరిగింది అర్థమైంది.... నీటిని తెర్లించి వదలిన అలలకు గాలి వాలున పోయివుండాలి. ఏం చేయాలో తోచలేదు. చిరుచెమటలు ప్రారంభంకాగా అలానే నిలుచుండిపోయింది నీటిమధ్య.

చిన్నప్ప గేదెలను కడిగి వొడ్డుకు తోలాడు. తనూ కాళ్ళూ, చేతులూ కడుక్కుని పైగావంచాతో తుడుచుకుంటూ వాటివెనకే వెళ్ళడానికి తయారయాడు. అది చూడడంతో మైనాకు కంగారు మరింత యెక్కువైంది.


గబాలున రేవునుంచి బయటపడి చెరువుగట్టు వెంబడి పరుగెత్తసాగింది. తడిసిన కుచ్చెళ్ళు కాళ్ళకు “తపాతపా” కొట్టుకుంటున్నాయి.

చిన్నప్ప యిదేమీ గమనించలేదు. పిల్లనగ్రోవిని పాడుకుంటూ గేదెల నదిలించుకుంటూ హుషారుగా నడవసాగాడు తన ధోరణిలో తాను.

“య్యేయ్!” మైనా పిలుపు వినబడలేదు చిన్నప్పకు. తనదోవన తను పోతూనే ఉన్నాడు. “య్యేయ్! న్హి.... న్హిన్నే” వగర్చుతూనే గట్టిగా పిలిచింది మళ్ళీ- మైనా పరిగెత్తుతూనే. బిందె ఎలాగోనని ఆమెకు కంగారెత్తిపోతోంది.

పిల్లనగ్రోవి పెదవుల పైనించి తీస్తూ తలతిప్పి చూశాడు. చిన్నప్ప ఈసారి. చెరువుచుట్టూ తిరిగి పరిగెత్తుకుని వస్తూ మైనా కన్పించగానే ఆశ్చర్యంతో మొత్తం వెనక్కి తిరిగాడు.

మరి రెండు క్షణాలకు వగర్చుతూ అతనికో పదిగజాల దూరంలో




ఆగింది మైనా వేగంగా పరిగెత్తిన అల సటకు రొప్పుతోంది.

చిన్నప్పకేమీ అర్థం కాలేదు. మైనా మాట పెగలక రొప్పుతూ ఎదురుగా చెరువు వేపు చూపుతూ వెక్కుతోంది. ఎగశ్వాస, దిగశ్వాస మధ్య మాట అల్లాడు తోంది.

"భి ... భి ....భిందీ..." అంది ఎలాగో కాసేపటికి.

రెప్పలు ఎగరేసి చెరువువంక చూశాడు చిన్నప్ప. దిగాలుగా చూసింది మైనా.

బిందె నీళ్ళతో ఒడ్డు చేరింది. మైనా భుజాన కెత్తుకుంటూ చిన్నప్పవంక కృత జ్ఞతగా చూసింది. నడక ప్రారంభించింది.

తడి బట్టలు పిండుకుంటూ అన్నాడు చిన్నప్ప— "అంత మసుపేల వొచ్చింది పిల్లా! 'అన్న'గాని గుర్తొచ్చినాడా?"— వెనుకనే వస్తూ

"లేఁ!" తల అడ్డంగా ఊపింది మైనా.

"మరేమయినది? వాలిన బిందె నీటి మద్దికాడ కెల్లిపోయిన వరకూ ఏం చేస్తుండినవ్?"

"సీ–నీ పాట యింటూండినాను."

తటపటాయించిన మైనా చిటుక్కున చెప్పింది.

నడక వేగం పెంచిందా మాటంటూనే.

"ఏ పాట?" వింతగా చూశాడు చిన్నప్ప తనూ వేగం అయ్యాడు.

"ఆ పాట!"

కళ్ళకొసలలోంచి పిల్లనగ్రోవి వంకా, అటునుంచి చిన్నప్ప కళ్ళలోకి చూస్తూ చెప్పింది. సిగ్గుపడ్డాడు చిన్నప్ప. "ఏదో పిచ్చిగ పాడుకుంటాను" అన్నాడు మైనా మాట్లాడలేదు. చిన్నప్పకు అసంతృప్తి కలి గింది.

"ఆకవరకూ యినిపిస్తన్నదా?" మళ్ళ కాసేపాగి అడిగాడు మంచినీళ్ళరేవు దృష్టిలో ఉంచుకుని.

"వూఁ"

"ఏదో.... పిచ్చిగ పాడుకుంటాను."

"లేఁ! చక్కగుండింది!" తను పొందిన అనుభూతి అంతా మిళితమైన స్వరంతో చెప్పింది మార్దవంగా మైనా.

చిన్నప్ప గుండెల్లో పిల్లనగ్రోవి మోగింది.

*  *  *

గుడిసెలో గుడ్డిదీపం మినుకు మినుకు మంటూ వెలుగుతోంది.

మైనా సత్తువ లేనట్టు గుంజకు జారగిల బడి ఉంది.

"మళ్ళీ చీకటి పడిపోతాంది" కళ్ళలో తిరగబోయిన నీళ్ళను అదిమిపడుతూ వందోసారి అనుకుంది. వలలో చిక్కిన తర్వాతి చేపపిల్లల్లా ఉన్నాయామె కళ్ళు. చూపు కొయ్యకిటికీ నుంచి అగుపడుతున్న చీకటి మీద ఉంది.

చీకటి దట్టమవుతున్నకొద్దీ మైనా గుండెలో గుబులు పేరుకుపోతోంది తళుక్కుమని పెరిగే ఒక్కో నక్షత్రానికీ ఆమె ఉలిక్కిపడుతోంది.

"ఏవే! యిది కొంపేనా అసలు?" కర కుగా బయట ఉరిమిందో గొంతు. అంత లోనే.

పాము బుసవిన్న మనిషిలా దిగ్గున లేచి నుంచుంది మైనా. పక్కనే పిడుగు పడ్డట్టు వణికిపోయింది. గుంజను వదల కుండా అటే తిరిగి నిలుచుంది. కళ్ళలో ప్రాణంలేదు. "వచ్చేసినాడు" అనుకుంది.

తిమ్మన్న గడపదాటి లోనికి వచ్చాడు.

అప్పుడే స్నానం చేసిన సూచనగా తల వంకీలనుంచి నీళ్ళు జారుతున్నాయి. బల మైన ఛాతీమీద అక్కడక్కడా సన్నని నీటిబిందువులు మెరుస్తున్నాయి.

మైనా భయంతో యిటు తిరిగే ప్రయత్నం చేయలేదు. అటువేపే తిరిగి ఉండిపోయింది. వెనుక గుంజని పట్టు కున్న ఆమె చేతులు సన్నగా కంపిస్తు న్నాయి

"ఏమే! వచ్చిన మొగాన్ని చూసేదు న్నదా....లేదా? అసలటే తిరిగుంట వేటి, తిరుఘిత"

ఠక్కున యిటు తిరిగింది మైనా. కళ్ళ రెప్పలు నేలకు వాల్చేసి గుంజను కౌగ లించుకుని బిగిసిపోయింది.

"నువ్వా గుంజని గాదు పిల్లా మనువాడి నావి! నన్ను. ఎల్లి కూడెట్టు." నవ్వాడు.

"హఁ!" ఏమన్నాడో వినిపించని స్థితిలో ఉంది మైనా. రెప్పలు పైకి లేచి తిమ్మన్న కంటపడగానే జారిపోయాయి.

"యహేఁ! ఎల్లి కూడెత్తళ!" అరి చాడీసారి తిమ్మన్న.

ఉలిక్కిపడింది మైనా. పరిగెత్తుకుని వెళ్ళి కంచం పెట్టి దీపం చేర్చింది. తడారిన గొంతు గుటకలు వేసుకున్నా నుదుట చెమ టను చేయెత్తి జబ్బకు తుడుచుకుంటూ వడ్డించింది గబగబా.

సుష్టుగా తినిలేచాడు తిమ్మన్న. దీర్ఘంగా ఓ త్రేనుపు త్రేన్చి గుమ్మం దగ్గర చతికిలబడి చుట్ట చుట్టుకుని వెలిగిం చాడు.

ఎంగిలి ఎత్తి నిస్సత్తువగా గుంజకు కూలబడింది మైనా. వాలుకంట గుమ్మం దగ్గర కూర్చున్న తిమ్మన్ననే చూడ సాగింది. అతని నోట వెలుగుతున్న చుట్టమీదే వుంది ఆమె చూపు. మరి కాసే పటికి చుట్టచివరి ఎర్రటి నిప్పుమీదే ఆగి పోయింది.

"చుట్టయిపోగూడదు" భయంగా అను కుంది

చుట్ట అయిపోగానే జరిగేతంతు ఆమెకు తెలుసు. ఆమె ఎంత కోరుకున్నా కాలేచుట్ట కాలక మానదు.... జరిగే తంతు జరక్కా మానదు.

చుట్ట అయిపోయింది.

ఖాండ్రించి ఉమ్మి లేచాడు తిమ్మన్న. తలుపు గడియపెట్టి ఒళ్ళు విరుచుకుంటూ మైనాని చూసి వెకిలిగా నవ్వాడు.

మైనా గుండెలో రాబందులు రెక్కలు తన్నుకున్నాయి.

వచ్చి పక్కన కూర్చున్నాడు. మళ్ళీ వెకిలిగా నవ్వి ఆమె ముఖాన్ని బలంగా చేతులతో తిప్పుకున్నాడు. పలుచని ఆమె పెదవులమీద మొరటుగా తన పెదవులు పెట్టి రుద్దసాగాడు. మైనా గింజుకుంది. అతని ఛాతీమీద చేతులువేసి నెట్టసాగింది.

మైనాకు పొగాకు వాసన ఏదోలా ఉంది. తిమ్మన్న పెదవులనించి వస్తున్న కమురు వాసన భరించలేకపోతోంది రోజూ ఎలాగో నిగ్రహించుకునేది. ఇవాళ కడుపులో మెలి తిప్పేస్తోంది....వాంతి వచ్చేలా తెములిపోతోంది.... త....తన్నుకు వచ్చేస్తోంది వాంతి....నిగ్రహించుకోలేకపోతోంది మైనా....

భళుక్కున వచ్చేసింది వాంతి....

ఒక్క వూపులో తిమ్మన్నను బలంగా అవతలకు తోసి పక్కకు తప్పుకుంది మైనా. క్షణాల్లో యిల్లూ, ఒళ్ళూ పాడు కావలసిందే. కానీ ఆఖరు క్షణంలో చేతిని నోటికి అదిమిపెట్టి బలవంతాన నిగ్రహించుకుంది మైనా. గొంతులోనే ఆగిపోయింది వాంతి.

తిమ్మన్నకు తిక్క రేగింది. మైనా విడిపించుక పోవడంతో ఉగ్రరూపం దాల్చుతూ చర్రున చూరునించి కమ్చీ లాగాడు.

"నీ యక్క! యిడిపించక పోతావే!" గొంతెత్తి అరిచాడు.

తాట లేచిపోయింది 'కెవ్వు' మన్న మైనా అరుపుతో మరుక్షణం. మోకాళ్ళలో తలదాచుకుంది మైనా. క్షణాల్లో ఆమె ఒళ్ళంతా ఎర్రటి వాతలు తేలాయి. మైనా మరి అరవలేదు. బండగా శరీరాన్ని అప్పగించింది. చేతులు నొప్పిపుట్టేదాకా కమ్చీ విసిరాడు. పోతూ పోతూ ఒక్క తన్ను తన్నాడు ఆఖర్న. వెల్లకిలా పడింది మైనా.

కష్టాలు మరీ ఎక్కువై పోయినప్పుడు వచ్చేది మొండితనం...

మైనా కంటనుంచి నీటిచుక్క జారలేదు. రెప్ప వేయకుండా చూరువేపే చూస్తూండిపోయింది. కోడిగుడ్లకు నల్లచుక్క దిద్ది నీటిలో వదిలితే ఆమె కళ్ళనిపిస్తాయి ప్రస్తుతం

"ఏవేఁ... యిప్పటికైనా వచ్చేదుందా?"

కాళ్ళూ, చేతులూ శవం తొక్కుకుంటూ కాసేపు గొణుక్కున్నాక అరిచాడు తిమ్మన్న మళ్ళీ. మైనా మాట్లాడలేదు. మరింత కోపంతో అదాటున లేచి పెద్ద పెద్ద అంగల్తో వెళ్ళి సరాసరి ఆమె పక్కనే ఆగాడు

మైనా తల తిప్పలేదు....కన్నార్పలేదు.

చూశాడు వంగి-ఓ చేత్తో కోకముడి లాగేశాడు. పైట పక్కన పారేసి మరో చేత్తో కంచుకం పటపటా విడదీశాడు. మీద పడ్డాడు.

శవం మీద పొర్లుతుంటే శవానికేమీ తెలియదు

మైనా శవంలా పడుకుంది.

ఆమె మెదడు స్తంభించింది.

కాల విచక్షణ పూర్తిగా విస్మరించింది.

ఎప్పటికో తనమీద బరువేదో తొలగిందని గుర్తించింది. వాల్చిన కళ్ళకు అర్థనగ్నంగా తన దేహం. పక్కనే గుర్రుపెట్టి నిద్రపోతూ తిమ్మన్నా కనిపించారు

దండె తల కిందకు చేర్చుకుని కళ్ళు మూసుకుంది అలానే పడుకుని.

చిన్నప్ప.... చిన్నప్ప గుర్తుకొచ్చాడామె కెందుకో ఓ క్షణం.

పోలిక అనేది చాలా ప్రమాదకరం.

మైనా తిమ్మన్నను చిన్నప్పతో పోల్చుకుంది.

అంతే!

* * *

తుపాను మొదలైంది.

నిశరాత్రి ప్రకృతికి పిచ్చెక్కినట్టుంది వాతావరణం.

రెప్ప వేయకుండా తీక్షణంగా చూస్తున్నాడు చినసింగరాయరెడ్డి కిటికీలోంచి బయటికి.

హోరున గాలి....మనుషులను యెగరేసే వేగంతో "హూ" యంటూ శబ్దం చేస్తూ ఊరూ వాడా. చెట్టూ చేమా ఏకం చేస్తూ మెలిదిప్పేస్తోంది. భూమ్యాకాశాలు కలుపుతూ భోరున వర్షం. కకావికలుగా చిమ్మి పారేస్తోంది జల్లు. ఫెళ ఫెళ మంటూ ఉరుములూ, మెరుపులూ ఉద్రేకపడి పోతున్నాయి

పల్లె పల్లె అంతా భయంతో తలుపులు బిడాయించుకున్నది.

చినసింగరాయరెడ్డి మాత్రం రెప్పైనా మూయడంలేదు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. చిన్ననాట తండ్రి తాతల తీర్పుల జ్ఞాపకాలతో ఆయన తల మరింత వేడిగా మారుతోంది. దవడ ఎముకలు ఆలోచనా తీవ్రతతో కదిలీ కదిలి ఎర్రగా కుమిలి పోతున్నాయ్

చిన్నప్పకు వెలి!

జల్లు ఎడాపెడా జివ్వుమంటూ కిటికీలోంచి తన్నుకొస్తోంది. చినసింగరాయరెడ్డిలో చలనంలేదు....చూపులో మార్పు లేదు....మీసంపై చేయి కదలిక ఆగలేదు. ఆయన మస్తిష్కంలో ఒకటేమాట దొర్లుతోంది.

వెలి!

అవును....వెలి!

గ్రామీణ కట్టుబాట్లను దాటినందుకు చిన్నప్పకు ఊరినించి వెలి!

తను యెంతో కాలంనించి ప్రేమగా చూసుకుంటున్న వాడికి ఊరి పెద్దగా తన మాట మేరకు ముందు వొళ్ళంతా కుళ్ళబొడిచి, తరువాత వెలి!


చిన్నప్పకు వెలి!

* * *

పచ్చని కాపుతో నిండి, గర్భిణిలా భారంగా వుంది మామిడితోట. మంద్రంగా వీస్తున్న గాలికి వయ్యారంగా తల ఊచుతోంది. దాదాపు ఎండపొడ చూపటంలేదు నేలమీద. ప్రశాంతంగా ఒళ్ళు గగుర్పొడిచేలా ఉంది వాతావరణం.

అన్నం తట్టతో మైనా తోటలోకి అడుగుపెట్టేసరికి చిన్నప్ప గడ్డిపామిమీద ఎక్కి ఉన్నాడు. అతని చేతిలో పిల్లన్రగోవి ఉంది.

మైనాని చూసి నవ్వి కిందకు దిగాడు. ఆరోజు అతను అన్నంమూట తెచ్చుకోకపోడంవల్ల మైనా తెచ్చింది. తిమ్మన్న కొట్టిన కమ్చీ గాయాలు మాను పడుతున్నా



యప్పటికి మైనా వంటిమీద. మనసులోని పుండుమాత్రం అలానేఉంది. తిమ్మన్నకు చినసింగరాయరెడ్డి మందలింపు జరిగింది.

ఆయన వంతు బాధ్యత నెరవేరింది. కాని ఫలితం ఎవరికి తెలుసు! పెదరెడ్డిగా ఆయన మందలించగలడే గాని వడగ్గరికి వెళ్ళి సంసారం చేయించలేదు కదా!

అందుకే మైనా సంసారం యథాప్రకారమే సాగుతోంది.

"ఏటి మేట ఎక్కినావు" లేనినవ్వు తెచ్చుకుని అడిగింది మైనా. గడ్డివామిదిగి వచ్చిన చిన్నప్పకు అన్నం తట్ట అందిస్తూ

"ఉట్టినే....పిల్లంగోరు వాయించుకోడానికి నాకు అక్కడయితే బావుంటాది." చెప్పి భోజనం ముగించాడు చిన్నప్ప. అంతసేపూ అక్కడే కూర్చుంది మైనా. తట్టసర్ది మైనాకు అందించాడు. మైనా దాన్ని మళ్ళీ అక్కడనే పెట్టేసింది.

చిన్నప్ప కొట్టంలోని గేదెలకు గడ్డివేసి వచ్చాడు. చినసింగరాయరెడ్డి యింటిదగ్గరి గేదెలుగాక తోటదగ్గర మేపే పాడి యిద. దీని విషయమూ చిన్నప్పే చూసుకోవాలి.

గేదెలకు గడ్డివేసి వచ్చిన చిన్నప్ప మైనా యింకా అక్కడే నిలబడి వుండటం చూసి "ఎంటి పిల్లా! కాయేవన్నా కోసుకుంటావా? కోసుకో!" అన్నాడు.

మైనా తల అడ్డంగా ఆడించింది. "లేం, ఓ పాట పాడవా? యినేసిపోతా" అంది బితుకు బితుగ్గా... ఏసుంటాదో అన్నట్టు.

చిన్నప్పకు అది పండగే అయింది. వెంటనే పిల్లనగ్రోవి తీసుకునివెళ్ళి గడ్డివామిలో కూలబడ్డాడు. పెదవులకు అందించాడు దానిని.

మైనా సంబరంగావెళ్ళి కాసింతదూరాన తనూ కూర్చుంది

మధురమైన వేణుగానం మొదలైంది. కళ్ళు అరమోడ్చి వేళ్ళు కదుపుతూ వెదురులోంచి విశ్వమోహనమైన నాదాన్ని పలికిస్తున్నాడు చిన్నప్ప. సాగే నాగునూ. పారే వాగునూ ఆపగల రసవత్స్వరాలహేల చిన్నప్ప మోవినుంచి ఉప్పొంగిస్తోంది. స్వర తరంగాలు వాతావరణాన్నంతా రస భరితం చేస్తున్నాయి.

ఆ గాలిపాటకు మైనా హృదయంలోని బడబానలం చల్లారి సన్నని పులకింత రేగసాగింది. కళ్ళు ఆర్ద్రమయాయి.... మరి కాసేపటికి పులకింత స్థాయి హెచ్చింది....

చిన్నప్ప వాయిస్తూనే ఉన్నాడు....

మైనాలో స్పందన ... అణువణువునా రోమ రోమానా స్పందన.... అనుభూతి

హృదయం లోతుల్లో ఎక్కడో కదలిక.... రసమయానుభూతి.... రసానుభూతి.... ఉద్వేగం.... ఆవేశం—ఉత్సాహం.... అభిమానం....కదలిపోతోంది మైనా.... ఆమెలో ఏదో సంచలనం...,సంచలనం.. సంచలనం....సంచలనం..సం....చ.... ల....నం....సం..,చ....ల....న....మ్..

ఉండుండి రివ్వున చిన్నప్ప మెడను వాటేసుకుంది మైనా. అతని ముఖాన్ని

బలంగా రుద్దేస్తూ జలజలా ఏడ్చేస్తోంది... చిన్నప్పను బలంగా హత్తుకుపోతూ అది మేసుకో సాగింది. కౌగిలి విడువకుండా అతన్ని తమకంతో తడిమేస్తూ అతని మెడనంతా ముద్దులతో ముంచెత్తసాగింది.

మరి కొద్దిసేపటికి చిన్నప్పా అదే స్థితిలో పడిపోయాడు. బలంగా హత్తుకుని వెచ్చని ఆమె చెక్కిలి నిమిరాడు. తపనతో అతని పెదవులను అందుకుంది మైనా. చిన్నప్ప ఆమె తల నిమిరాడు లాలనగా. తొలిసారిగా జీవితంలో స్వర్గ ద్వారాలు తెరుచుకుంది మైనా.

క్షణాలు దొర్లుతున్నయ్....గడ్డివామి సుఖంతో మూల్గుతోంది....

పచ్చి ఎరువు పొలానికి తోలుకు వెళ్ళడానికి తిమ్మన్న వచ్చాడు అంతలోనే.











రవి సెక్యూరిటీస్ కంపెనీ

పోస్టుబాక్సు నెం. 4

దేవాలయం వీధి, కాకినాడ

ఆకర్షణీయమైన వడ్డీ రేట్లపై డిపాజిట్లు స్వీకరింపబడును ఒక సం॥నకు 16% రెండు సం॥లకు 17%, మూడు సం॥లకు 18% వడ్డీ పూర్తి సెక్యూరిటీపై ఇవ్వబడును. కోరిన వెంటనే డిపాజిట్ తిరిగి తీసుకునే సదుపాయం గలదు. వివరములకు సంప్రదించండి.

ప్రొప్రయిటర్

చందలాడ వీరభద్రరావు

ఎడ్లను విప్పి గడ్డికోసం పామి దగ్గరకు వెళ్ళాడు....

* * *

బ్రహ్మాండం బద్దలైనట్టు ఫెళ ఫెళ ఫెళ మంటూ ఎక్కడో పిడుగు పడింది.

చినసింగరాయరెడ్డి చలనం లేకుండా అలా చూస్తూనే వున్నాడు. కిటికీ తలుపులకు అడ్డంగా పడకకుర్చీ చేతులు....వాటి పైన ఆయన కాళ్ళు జల్లు అలా కురుస్తూనే వున్నా ఆయన లేచే ప్రయత్నం చేయటంలేదు. కుర్చీకి వున్న యెనుబోతు తోలు సన్నని వూపుకు చిరుగబడంచేస్తోంది.

ఘోరు మంటోంది తుపాను.

చినసింగరాయరెడ్డి మనసులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. మైనాయే ఆయన కళ్ళముందు మెదులుతోంది.

అమాయకమైన మైనా....తన యింట చిన్ననాటినుంచీ పనిచేసిన మైనా....తన యెదుట ఏనాడూ నోరువిప్పని మైనా....తన చేతులతో పెండ్లిచేసిన మైనా. తాటలు తేలిన దెబ్బలు చూసి యెన్నిసార్లో తను అడిగినప్పుడు "రోజా అంతే దొర!" అని వెర్రినవ్వు నవ్వుతూ చెప్పిన మైనా.

తలుచుకున్నకొద్దీ గొంతులో గరళం పేరుకుంటోంది చినసింగరాయరెడ్డికి.

ఆలోచనా ప్రవాహంలో మునిగిఉన్న చినసింగరాయరెడ్డికి హఠాత్తుగా ఆ ఆలోచనలన్నీ వదిలివేశాడు. తుపానుహోరుపై దృష్టి కేంద్రీకరించాడు ఏకాగ్రతతో. ఆ హోరు మధ్యనుంచి సన్నగా.... అతి సన్నగా విన్పిస్తోందేదో సుస్వరం.... జాగ్రత్తగా పరిశీలించాడు.... అది.... అది.... వేణుగానం! పిల్లనగ్రోవిపై వాదనం.... పెరటినుంచి....

"చిన్నప్పా!" చినసింగరాయరెడ్డి అనుకున్నాడు.

ఇంతటి తుపానుయేళ ఎందుకు వాయిస్తున్నాడు? లేచాడు చినసింగరాయరెడ్డి ఒక్కక్షణం ఆగాడు. మరుక్షణం ముఖంలో ఖారం అలలాగా తొలగింది. నుదుటిమీది ముడతలు తగ్గాయి. మీసం మెలివేస్తున్న చెయ్యి ఆగింది.

కిటికీ తలుపులు మూసి పెరటి తలుపులు తెరిచి బయటికి నడిచాడు చినసింగరాయరెడ్డి. తుపాను ఉధృతంగా ఉంది. కానీ ఆ హోరులో సన్నగా వినవస్తున్న మురళీగానాన్నే ఆలకిస్తు పెద్ద పెద్ద చెట్లను సైతం కుదిపి పారేస్తున్న తుపాను గాలిలో ఏనుగు బలంతో తడబడకుండా నిబ్బలంగా ఒక్కో అడుగూ వేసుకుంటూ కొట్టం దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు చినసింగరాయరెడ్డి.

చిన్నప్ప- పెదవులపై పిల్లనగ్రోవి పాడుతోంది.... కళ్ళనించి నీళ్ళు ధారాపాతంగా కారిపోతూనే ఉన్నాయి.

చినసింగరాయరెడ్డి రావడం గమనించనేలేదు చిన్నప్ప. అలా వాయిస్తూనే వున్నాడు పిల్లనగ్రోవిని కాసేపటికి చినసింగరాయరెడ్డి పిలిచాడు.

"చిన్నా!"

దిగ్గున లేచి నించున్నాడు చిన్నప్ప. పెదరెడ్డిని చూశాడు. తలవంచుకున్నాడు.

గుడ్డిదీపం గుటుకూ గుటుకూ మంటోంది

కొట్టంలోకి అడుగుపెట్టి నులకమంచం మీద కూర్చున్నాడు చినసింగరాయరెడ్డి. నిలువునా తడిసిపోయి వున్నాడాయన. దీపంవంక చూస్తూ అన్నాడు కాసేపటికి.

"ఏరా!"

చిన్నప్ప తల ఎత్తలేదు. బదులు చెప్పలేదు.

"జరిగేదేమిటో తెలుసుగ!"

తల ఊపాడు చిన్నప్ప. "ఎలి." అన్నాడు.

"ముందు నా మాటమీద కుల్లబొడిశాక. అవున?"

కుప్పకూలిపోయాడు చిన్నప్ప గడ్డిపోగులోకి, నమస్కారంచేస్తూ. "నన్ను సంపించు దొరా! నే బతకలేను.... నా మైనా లేందె నే బతకలేను.... నన్ను సంపించు దొరా! సంపించు.... నా మైనా లేందె నే బతకలేన్దొర! నన్ను సంపించు!"

అతను చెప్పేదదేమాట. గడ్డిపోగులో మెలికలు తిరిగిపోసాగాడు.

చినసింగరాయరెడ్డి తృప్తిగా నిట్టూర్చాడు. "రేయ్! చిన్నా!" స్థిరంగా పిలిచాడు. చిన్నప్ప తల ఎత్తాడు.

"నువ్వు ఎంటనే ఊరిడిసిపోరా!" దవడ ఎముక బలంగా కదులుతుండగా దీపం వంక చూస్తూ అన్నాడు చినసింగరాయరెడ్డి. కళ్ళలోకి ఎర్రజీరలు వచ్చాయి.

పిచ్చిగా చూశాడు చిన్నప్ప.

"ఆఁ! ఊరిడిసిపో.... బడిలో ఉన్న మైనాన్దీసుకని."

"దొర." ఉలిక్కిపడ్డాడు చిన్నప్ప.

"అవున. మైనా న్దీసుకుని ఎంటనే ఊరిడిసిపో....ఇది ఊరిపెద్దగ కటినంగనే ఏసే ఎలి కాదుర....కన్నబిడ్డని మెట్టినింటికి ప్రేమారా పంపుతున్నా. పొండిర. చల్లగుండండి."

చినసింగరాయరెడ్డి పాదాల వాలిపోయాడు చిన్నప్ప.

* * *

తూరుపు తెలతెలవారుతోంది.

రావిచెట్టు కూకటి వేళ్ళతో లేచిపోయింది.

గ్రామ చావడి కూలిపోయింది.

తుపాను తీరం దాటింది.

●

కొత్త సీరియల్!
'చంచల మనస్కులతో సంసారయాత్ర'
'తేనెలో ముంచిన కలాన్ని
'పంచదారలో అద్ది
శ్రీ ఇచ్ఛాపురపు జగన్నాథరావు
రాస్తున్న
మొగలి రేకులు
జగన్నాథ కథచక్ర ప్రణయఘోష
త్వరలో
మీ అభిమాన
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో
ప్రారంభం!